సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 17 । జనవరి । 2023




నాగోబా ఆలయంలో పూజలు

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో రాష్ట్ర రవాణశాఖ జాయింట్ కమిషనర్ పాండురంగనాయక్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోటెత్తిన భక్తజనం

జైనథ్ మండలంలోని పూసాయి ఎల్లమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

10లో▸



గరిష్టం/కనిష్టం
31.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగ మంచు ప్రభావం కొనసాగనుంది.

న్యూస్‌రీల్

క్రీడలతో స్నేహభావం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్: క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢత్వంగా ఉంటారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో సోమవారం ఆదిలాబాద్ క్రికెట్ లీగ్ (ఏసీఎల్) టోర్నీని ప్రారంభించారు. నిరంతర కఠోర సాధనతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, ఈ దిశగా యువత ఉత్సాహంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్, శివ, కౌన్సిలర్ అశోక్ స్వామి, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలంలోని మహాగావ్ గ్రామంలో అఖండ హరినామా సప్తహా ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గాన్ని ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బానోత్ గజానంద్‌నాయక్, యశ్వంతరావు, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, తుడందెబ్బ మండలాధ్యక్షుడు ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జాదవ్ రెడ్డినాయక్, డీఎస్పీ రఘునాథ్‌చౌహాన్ తదితరులున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) అధ్వర్యంలో ముద్రించిన 2023 క్యాలెండర్లు, డైరీలను డీఈవో ప్రణీత తన చాంబర్‌లో సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామగిరి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాంతారావు, కోశాధికారి అనిల్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ హేమంత్ జాడే పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుతోనే గిరి పల్లెలు అభివృద్ధికి దూరం

- ఎంపీ సోయం బాపూరావ్



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపూరావ్

తాంసి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వందన యోజన పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయకపోవడంతోనే గిరి గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. మండలంలోని లీమ్‌గూడ గ్రామంలో జైహనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తన నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో రూ.860 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనంతరం గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంపీకి స్థానికులు విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, సర్పంచ్‌లు సంభు, యశ్వంత్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు భరత్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే భీంపూర్ మండలంలోని మార్కగూడలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను ఎంపీ సోమవారం తిలకించారు. ఇందులో సర్పంచ్ సునిత, తదితరులు పాల్గొన్నారు.

తపస్ డైరీ ఆవిష్కరణ

ఆదిలాబాద్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) 2023 డైరీలను ఎంపీ సోయం బాపురావు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. ఆదర్శ సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అన్నారు. ఇందులో తపస్ జిల్లా అధ్యక్షులు సునీల్ చవాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, బచ్చు నారాయణ, చంద్రశేఖర్ ముండే, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తాంసి మండల కేంద్రంలో కాలనీలోని సీసీ రోడ్డు

ఉపాధి హడావుడి

- జిల్లాలో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు
- 'మెటీరియల్' కింద రూ.40కోట్లకు ఫైగా పనులు
- ఆర్థిక సంవత్సరం ముగింపునకు చేరువ నేపథ్యంలో..
- గతేడాది పనులకే రూ.10 కోట్లకు ఫైగా బిల్లులు పెండింగ్?

నియోజకవర్గం	నిధుల అంచనా
ఆదిలాబాద్	రూ.20 కోట్లు
బోథ్	రూ.13.48 కోట్లు (పనులకు ఆమోదం)
ఖానాపూర్ (ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల్లో)	: రూ.5 కోట్లు
ఆసిఫాబాద్ (నార్నూర్, గాదిగూడ మండలాల్లో)	: రూ.5 కోట్లు

సాక్షి,ఆదిలాబాద్: ఆర్థిక సంవత్సరం ముగింపునకు చేరువవుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ నిధుల వినియోగానికి హడావుడి మొదలైంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో లేబర్ కంపోనెంట్ కింద 60 శాతం, మెటీరియల్ కంపోనెంట్ కింద 40 శాతం వెచ్చిస్తారు. అయితే ఏటా గ్రామాల్లో మెటీరియల్ కంపోనెంట్ కింద సీసీ రోడ్లకు శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు జిల్లాలో రూ.40కోట్లకు ఫైగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.

కొన్నింటికే గ్రీన్ సిగ్నల్..

గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యేల ద్వారా ప్రతిపాదనలు తీసుకుంటారు. వాటిని పంచాయతీరాజ్ శాఖ ఈఈ కలెక్టర్ పరిశీలనకు పంపుతారు. అక్కడ ఆమోదం పొందిన తర్వాత ఈ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పిస్తారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ పూర్తయింది. ఇక అక్కడినుంచి ఆమోదం రావాల్సి ఉంది. మరోవైపు బోథ్ నియోజకవర్గ పనులకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ లభించింది. ఇక ఆదిలాబాద్ నియోజకవర్గంతో పాటు జిల్లాలో కొద్ది భాగం ఉన్నటువంటి ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు కూడా ఆమోదం రావాల్సి ఉంది. మార్చి 31లోగా ఈ పనులను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీంతో వీటి ఆమోదం, పనుల అప్పగింత, నిర్మాణం ఇవన్నీ చకచకా జరిగిపోవాలి. దీంతో ఆయా శాఖల్లో ప్రస్తుతం వీటికి సంబంధించి హడావుడి నెలకొంది.

గతేడాది బిల్లులే పెండింగ్..

ఉపాధి హామీ మెటీరియల్ కంపోనెంట్ కింద చేపట్టే ఈ పనులకు సంబంధించి టెండర్లు కాకుండా నామినేషన్ పైనే అప్పగిస్తున్నారు. స్థానిక నాయకులే ఈ పనులు చేపడుతున్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఎవరైనా ఈ పనులను నామినేషన్ పద్ధతిపై పొందుతారు. అయితే గతేడాది జిల్లాలో రూ.30 కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.20 కోట్ల బిల్లులు మంజూరు కాగా, మరో రూ.10 కోట్ల పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే జీపీల్లో నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ వైపు పెండింగ్ బిల్లులు, మరోవైపు నిధుల మంజూరు లేకపోవడంతో ఈ సీసీ రోడ్ల పనులను చేపట్టేందుకు ఆసక్తి చూపిస్తారా అనేది వేచి చూడాల్సిందే.

పనులకు ఆమోదం రావాల్సి ఉంది



గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లనిర్మాణానికి సంబంధించి ఆదిలాబాద్, బోథ్, జిల్లాపరిధిలోకి వచ్చే ఖానాపూర్, ఆసిఫాబాద్‌లోని మండలాల్లో పనులకు సంబంధించి ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి పంపించాం. ఆమోదం రాగానే పనులు చేపడుతాం.

– మహావీర్, ఈఈ, పంచాయతీరాజ్, ఆదిలాబాద్

మెటీరియల్ కంపోనెంట్ కింద..



ఉపాధి హామీ మెటీరియల్ కంపోనెంట్ కింద పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుంది. ఆ శాఖ రూపొందించిన ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తర్వాత ప్రభుత్వానికి పంపించడం జరుగుతుంది. అక్కడ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత పనులు చేపట్టడం జరుగుతుంది.

– కిషన్, డీఆర్డీవో

బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు



ఉపాధి హామీ పథకం కింద గతేడాది చేపట్టిన పనులకు సంబంధించి ఇప్పటివరకు బిల్లులు రాలేదు. దీంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవ్వాల్సి వస్తుంది. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

– వి.ఇంద్రశేఖర్, సర్పంచ్, బేల

గురువులకు తీపి కబురు

- బదిలీ, పదోన్నతులకు రంగం సిద్ధం
- ఫిబ్రవరిలోగా ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశం
- ఉపాధ్యాయుల్లో హర్షం
- విద్యార్థులకు చేకూరనున్న ప్రయోజనం

జిల్లాలో మంజూరైన పోస్టులు	3,028
పనిచేస్తున్న ఉపాధ్యాయులు	2,474
ఖాళీలు	554
పదోన్నతులు	255

ఆదిలాబాద్‌టౌన్: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. ఫిబ్రవరి నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించడం ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం నింపింది. సీఎం ఆదేశాల మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు జిల్లాల వారీగా ఉన్న ఖాళీల వివరాలపై డీఈవోలతో సమీక్ష నిర్వహించారు. సంక్రాంతి కానుకగా బదిలీ, పదోన్నతులు లభించనుండడంతో గురువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేస్తే దీర్ఘకాలంగా ఒకేచోటా ఉన్న ఉపాధ్యాయులు తాము కోరుకున్న చోటికి బదిలీ కానుండగా, ఏళ్ల తరబడి పదోన్నతులకు దూరమైన వారికి లబ్ధి చేకూరనుంది. టీఆర్టీ నిర్వహణకు సైతం మార్గం సుగుమం కానుంది.

పండుగ నేపథ్యంలో గుడ్‌న్యూస్..

సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం పంతుళ్లకు తీపి కబురు అందించింది. ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రరెడ్డిలు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఆదివారం హైదరాబాద్‌లో బదిలీ, పదోన్నతులపై సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరిలోనే ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2018లో బదిలీలు జరగగా, ఐదేళ్ల నుంచి ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అలాగే 2015లో ఉపాధ్యాయుల పదోన్నతులు జరగగా, ఎనిమి దేళ్ల నుంచి ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. జనవరి 2020 సంవత్సరంలో బదిలీ, పదోన్నతుల ప్రక్రియ చేపడతామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించినప్పటికీ దాని ఊసే లేకుండా పోయింది. ఈ క్రమంలో కొన్నేళ్లుగా ఉపాధ్యాయ సంఘాలు బదిలీ, పదోన్నతుల కోసం ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పలువురు పేర్కొంటున్నప్పటికీ, ఉపాధ్యాయులు, విద్యార్థులకు మేలు చేకూరనుంది.

భర్తీ కానున్న ఖాళీలు..

జిల్లాలో ప్రస్తుతం 554 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో 30 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ (డీఎస్సీ ద్వారా) స్కూల్ అసిస్టెంట్, అలాగే ఎస్జీటీ 299 పోస్టులను భర్తీ చేస్తారు. ఇక 255 పోస్టులు పదోన్నతుల ద్వారా భర్తీ చేయనున్నారు. అధికారుల లెక్కలప్రకారం 40 మందికి పీజీహెచ్‌ఎం, 145 మందికి స్కూల్‌అసిస్టెంట్, 48 మందికి పీజీ హెచ్‌ఎం పదోన్నతులు లభించనున్నాయి. పీజీ హెచ్‌ఎం పోస్టులు మాత్రం 4 మల్టీ జోన్‌లు కాళేశ్వరం, బాసర, రాజన్న, భద్రాద్రి జోన్‌ల పరిధిలోని ఉపాధ్యాయులతో భర్తీ చేస్తారు. స్కూల్ అసిస్టెంట్,ఎస్జీటీ, పీఎస్ హెచ్‌ఎం పోస్టులు జిల్లా పరిధిలోని ఉపాధ్యాయులతో భర్తీ చేయనున్నారు. అధికారుల లెక్కల ప్రకారం దాదాపు 253 మందికి పదోన్నతి లభించే అవకాశం ఉంది.

వెయ్యి మందికి స్థానచలనం..

జిల్లాలో దాదాపు వెయ్యి మంది ఉపాధ్యాయులకు స్థానచలనం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2018 సంవత్సరంలో ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. అయితే ఇటీవల ప్రభుత్వం 317 జీవో ద్వారా ఇతర జిల్లాల నుంచి 312 మంది ఉపాధ్యాయులు జిల్లాకు వచ్చారు. వీరు మినహా మిగతా వారందరు బదిలీ చేసుకునేందుకు అవకాశం ఉంది. పనిచేస్తున్న చోటా రెండేళ్లు దాటితే బదిలీకి అర్హులు. ఈ లెక్కన జిల్లాలో 2,100 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దాదాపు 500 మంది ఉపాధ్యాయులు ఒకేచోటా ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నారు. వీరికి తప్పనిసరిగా స్థానచలనం జరగనుంది. మిగతా 500 మంది వరకు ఉపాధ్యాయులు వారు కోరుకున్న చోటా స్థానచలనం జరిగితే బదిలీ అయ్యే అవకాశాలు ఉంటాయి.

విద్యార్థులకు ప్రయోజనం..

పదోన్నతుల ప్రక్రియతో విద్యార్థులు, నిరుద్యోగులకు మేలు చేకూరనుంది. చాలా ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పదోన్నతులు చేపట్టనుండడంతో ఆయా సబ్జెక్ట్ పోస్టులు భర్తీకి నోచుకోనున్నాయి. ఈ ప్రక్రియ తర్వాత ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలున్నాయి.

సంతోషకరం..

ప్రభుత్వం ఇప్పటికైనా బదిలీ, పదోన్నతులు చేపడుతుందని ప్రకటించడం సంతోషంగా ఉంది. ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలి. జీఓలో లొసుగులు లేకుండా చూడాలి. సంక్రాంతి కానుకగా ఉపాధ్యాయులకు ప్రకటించిన నేపథ్యంలో హర్షిస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయంతో నిరుద్యోగులకు కూడా మేలు జరగనుంది.

– వెంకట్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

సిద్ధం చేస్తున్నాం..

ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ చేపడుతున్న నేపథ్యంలో సీనియారిటీ జాబితా, ఖాళీల వివరాలను సేకరిస్తున్నాం. ఇంకా షెడ్యూల్ విడుదల కాలేదు. టెలీ కాన్ఫరెన్స్ ద్వారా పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ వివరాలను కోరగా, వాటిని అందజేశాం. – ప్రణీత, డీఈవో

'ప్రజావాణి'పై పండుగ ప్రభావం

- అధికారులు గైర్హాజరు
- అర్జీదారులూ అంతంతే..



సమస్యను వింటున్న అదనపు కలెక్టర్ నటరాజ్

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంపై పండుగ ప్రభావం కనిపించింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు అర్జీదారులు అంతంతమాత్రంగానే హాజరుకాగా, బీసీ సంక్షేమాధికారి రాజలింగం మినహా మిగతా జిల్లాస్థాయి అధికారులంతా గైర్హాజరయ్యారు. సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను అదనపు కలెక్టర్ నటరాజ్ స్వీకరించారు. వాటిని పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల ఉద్యోగులకు సూచించారు. ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా నిర్మాణాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. భూ సమస్యలను మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్‌రాథోడ్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియా పాల్గొన్నారు.

పత్తి రైతులను ఆదుకోవాలి

- క్వింటాల్‌కు రూ.15వేలు చెల్లించాలి
- కలెక్టరేట్ ఎదుట తుడుందెబ్బ ధర్నా

కైలాస్‌నగర్: పత్తి రైతులను ఆదుకునేలా క్వింటాల్ పత్తికి రూ.15వేలు చెల్లిస్తూ, సీసీఐ వాణిజ్య కొనుగోలు చేపట్టాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, రైతుల పంట రుణాలు మాఫీ చేయాలనే డిమాండ్లతో సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాగు పెట్టుబడి పెరిగినందున, వాటికనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులతో సీసీఐ పోటీపడి పత్తిని కొనుగోలు చేయక పోవడంతోనే రైతులు నష్ట పోతున్నారన్నారు. పార్లమెంట్‌లో పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో రమేశ్‌రాథోడ్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉయిక సంజీవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్కే పాండురాంగ్, కుడ్మెత తిరుపతి, కుమ్ర శ్యాంరావు, వెట్టి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఘనంగా సంక్రాంతి



ఆదిలాబాద్: సంక్రాంతి, కనుమ సంబరాలను జిల్లావాసులు ఆది, సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు వేకువజామునే ముంగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్ది, వాటి మధ్యలో గొబ్బెమ్మలను ఉంచారు. అనంతరం గౌరీ మాతకు పూజలు నిర్వహించి, నోములు నోచుకున్నారు. యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగిరేస్తూ సందడి చేశారు.



సమన్వయంతో 'కంటి వెలుగు' విజయవంతం

- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ నటరాజ్, డీఎంహెచ్‌వో నరేందర్

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు మలివిడత కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విజ యవంతం చేయాలని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ఆయా జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, పోలీస్, వైద్యాధికారులతో కంటి వెలుగుపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 18న సీఎం కేసీఆర్ ఈ కార్యక్రమాన్ని ఖమ్మంలో లాంచనంగా ప్రారంభిస్తారన్నారు. 19న ఆయా జిల్లాల్లో శిబిరాలను మంత్రులు, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్‌లు, శాసన మండలి సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారన్నారు. ఉదయం 8:45 గంటలకు తప్పనిసరిగా ఆయా బృందాల సభ్యులు క్యాంపు లోకేషన్‌లో హాజరుకావాల్సానరు. శిబిరాల నిర్వహణపై గ్రామాలు, వార్డుల్లో టాంటాం, ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు శిబిరాలకు హాజరై కంటి పరీక్షలు చేయించుకునేలా మహిళా సంఘాల సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు వారిని చైతన్యపర్చాలన్నారు. ప్రతీ శిబిరానికి అవసరమైన సామగ్రి, మందులు, కళ్ల జోళ్లు ఇప్పటికే సరఫరా చేశామన్నారు. శిబిరాలకు వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్ కార్డు వెంట తెచ్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ నటరాజ్, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్‌రావు, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

వైటీసీలో కంటి వెలుగు డెమో

ఆదిలాబాద్‌టౌన్: స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు డెమో కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలో 468 గ్రామపంచాయితీలు, 49 మున్సిపల్ వార్డుల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతంలో 27, పట్టణ ప్రాంతంలో ఆరు బృందాలను ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మున్సిపల్ కమిషనర్ శైలజ, అదనపు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి సాధన, వైద్యులు, ఇతర సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో కంట్రోల్‌రూం..

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 18నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి సంబంధించి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 08732-295062తో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూం నంబర్‌ను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సోమవారం మీడియాకు విడుదల చేశారు. కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి సమస్యలు, సందేహాలున్న ఈ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని అద్దాలను పొందాలన్నారు. అంతకు ముందు కంటి వెలుగు శిబిరం నిర్వహణ సిబ్బందికి కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి వెలుగు నిర్వహణాధికారి డా.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.



కంట్రోల్‌రూం నంబర్ చూపుతున్న డీఎంహెచ్‌వో

క్లుప్తంగా

లారీ బోల్తా

- బ్రేక్ ఫెయిల్ కావడంతో టోల్‌ప్లాజా వద్ద ఘటన
- తప్పిన ప్రమాదం



రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద బోల్తాపడ్డ లారీ

నేరడిగొండ: మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద సోమవారం లారీ బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. బెంగుళూరు నుంచి ఉత్తరప్రదేశ్ వైపు వెళ్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో టోల్‌ప్లాజా పక్కన పల్టీ కొట్టింది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం చోటుచేసుకోలేదు. టోల్‌ప్లాజా ఉద్యోగులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

గోదావరిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం

బాసర(ముథోల్): బాసర గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆమె వయస్సు సుమారు 55 సంవత్సరాల వరకు ఉంటుందని, ఇతర ఆధారాలు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వివరాలు తెలిసిన వారు స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.

కొండ చిలువ హతం



హతమైన కొండ చిలువ

ముధోల్: మండల కేంద్రంలోని కంటి ఆస్పత్రి ఎదుట భైంసా–బాసర వెళ్లే మార్గంలో సోమవారం కొండచిలువను హతమార్చారు. 9 అడుగుల పొడవున్న కొండ చిలువ రోడ్డుపైకి రావడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. అందులో కొందరు ముందుకు వచ్చి కొండ చిలువను హతమార్చారు.

చోరీకి యత్నం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో గల జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చొరబడి చోరీకి ప్రయత్నిస్తుండగా పట్టుబడ్డారు. చోరీకి పాల్పడుతున్న గుర్తు తెలియని ఇద్దరి వ్యక్తులను గమనించిన అసోసియేషన్ భవన మేనేజర్ చెట్టిపల్లి గట్టయ్య వెంటనే తేరుకుని స్థానికులకు సమాచారం అందించి అప్రమత్తమయ్యాడు. దొంగలు రెండు ఏసీలు తీసి ఉంచడంతో హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌కు కూడా సమాచారం ఇచ్చాడు. తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లిన దొంగలను బయటకు రాకుండా తలుపులు వేసి లోపలే బంధించారు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్ అసోసియేషన్‌కు చేరుకుని అప్పటికే పట్టుకుని ఉన్న దొంగలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సింగరేణిలో ట్రాన్స్‌ఫర్ పాలిటిక్స్!



ఆస్పత్రి ఎదుట రాస్తారోకో చేస్తున్న నాయకులు

- ఆర్కేపీ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆకస్మిక బదిలీ
- వచ్చే ఎన్నికల్లో చెన్నూర్ నుంచి పోటీచేసే అవకాశం
- బదిలీ వెనుక రాజకీయ కోణం ఉందని విమర్శలు

రామకృష్ణాపూర్: సింగరేణిలో రాజకీయం జోక్యం రోజురోజుకూ పెరుగుతోందా అంటే అవుననే అంటున్నాయి కార్మిక సంఘాలు. ఇప్పటికే అధికారిక కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని యాజమాన్యం ఆదేశించింది. ఇదే అదునుగా సంస్థ విస్తరించి ఉన్న జిల్లాలు, నియోజకవర్గాల్లో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు సంస్థ కార్యకలాపాల్లో జోక్యం చేసుకుంటున్నారు. క్వార్టర్ల కేటాయింపు, బదిలీలను ప్రభావితం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా రామకృష్ణాపూర్‌లోని ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను రెండ్రోజుల క్రితం ఆకస్మికంగా బదిలీ చేయడం చర్చనీయాంశమైంది. ఖమ్మం జిల్లా ఎల్లందుకు బదిలీ చేయడం వెనుక రాజకీయ జోక్యం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాపతినిధి ఒత్తిడితో ఉన్నతాధికారులు బదిలీ చేశారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

మూడేళ్లుగా విధి నిర్వహణ..

2019 జూన్‌లో రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో రాజరామేశ్ విధుల్లో చేరారు. కోవిడ్ విజృంభించిన సమయంలో కొందరు వైద్యులు సెలవుపై వెళ్లినప్పటికీ రాజరమేష్ లీవు పెట్టకుండా అత్యుత్తమ వైద్య సేవలందించి సంస్థ ఉన్నతాధికారుల మన్ననలు పొందాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఆయన విధి నిర్వహణలో చిత్తశుద్ధి ప్రదర్శించటమే కాకుండా పలు సేవా కార్యక్రమాలతో ప్రజల్లో తనదైన ముద్ర వేసుకున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి.

రాజకీయాల్లోకి వస్తాడన్న అనుమానంతోనే..

డాక్టర్ రాజరమేశ్ త్వరలో రాజకీయ అరంగేట్రం చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీలోకి వెళ్తారనేది ఇంకా స్పష్టత లేకపోయినప్పటికీ ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీతో రాజరమేశ్‌కు సత్సంబంధాలు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రాజరమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ మహోత్సవంలో కూడా ఆ మాజీ ఎంపీ పాల్గొనటం చర్చానీయాంశమైంది. ఎస్సీ వర్గానికి చెందిన రాజరమేశ్ రాజకీయాల్లోకి వచ్చి.. చెన్నూర్ నియోజకవర్గం నుంచి ఏదైనా పార్టీ నుండి బరిలోకి దిగితే కచ్చితంగా తమకు బలమైన ప్రత్యర్థి అవుతారన్న ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని విపక్ష పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. బదిలీ నిలిపివేయని పక్షంలో లాంగ్‌లీవ్ పెట్టి మరింతగా ప్రజలకు చేరువై ఎన్నికల సమయానికి అధికార పార్టీకి దీటుగా నిలిచే ఏదైనా ఓ పార్టీలో చేరి చెన్నూర్ అసెంబ్లీ బరిలో పోటీ చేసే అవకాశలున్నాయని అంటున్నారు. ఏదేమైనా రాజరమేశ్ పొలిటికల్ ఎంట్రీకి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలుస్తోంది.

బదిలీ నిలిపివేయాలని ఆందోళన



స్వచ్ఛందంగా మూసివేసిన దుకాణాలు

రామకృష్ణాపూర్: సింగరేణి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజరమేశ్‌ను ఆకస్మికంగా బదిలీ చేయడంపై విపక్ష నాయకులు ఆదివారం స్థానిక కోల్‌బెల్ట్ రహదారిపై ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ రాజరమేశ్ కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో ప్రాణాలకు తెగించి సెలవులు పెట్టకుండా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. తన సోదరి పేరిట జీఎస్‌ఆర్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న డాక్టర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులే బదిలీ చేయించారని ఆరోపించారు. వెంటనే బదిలీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బదిలీని నిరసిస్తూ సోమవారం పట్టణ బంద్ నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. దుకాణాలు మూసివేసి డాక్టర్ బదిలీ నిలిపివేయాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మహంకాళి శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, ఐఎన్‌టీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పొన్నాల సాగర్, నాయకులు మల్లయ్య, శ్రీనివాస్, పాలరాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్‌తో సేవా కార్యక్రమాలు...

ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో డాక్టర్ రాజరమేశ్ తన సోదరి పేరిట జీఎస్‌ఆర్(గొడిసెల సురేఖరాజ్) ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. దానిద్వారా ఆపదలో ఉన్న వారికి, అనాథలకు చేయూతనందిస్తున్నారు. పలువురికి ఆర్థిక సహాయం కూడా చేశారు.ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి బదిలీ చేయటంపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ విధుల్లో చేరి మూడేళ్ల అవుతున్నా అకస్మాత్తుగా బదిలీ చేయటంపై సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు, విపక్ష పార్టీల నేతలు మండిపడుతున్నారు.

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏరియా నాయకులు పోచం, శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 29న భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించే సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏడో రాష్ట్ర మహాసభల పోస్టర్ సోమవారం గోలేటిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను ఐక్యం చేసి, యూనియన్ కార్మికుల హక్కులు, వేతనాల కోసం పోరాటాలు చేస్తోందన్నారు. పోరాటాల ఫలితంగానే కనీస వేతనం, పీఎఫ్, ఆసుపత్రి, పనిభద్రత, బోనస్‌లాంటి అనేక హక్కులు సాధించుకున్నామని పే ర్కొన్నారు. అదే తరహాలో ఒకటో కేటగిరి వేతనం, పర్మినెంట్, గ్రాట్యూటీ వంటి సమస్యలను 11వ వేజ్‌బోర్డు ఒప్పందంలో ప్ర ధాన ఎజెండాగా పెట్టి చర్చించాలని డి మాండ్ చేస్తూ ఉద్యమాలు చేపట్టామన్నారు. కొత్తగూడెంలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూ పొందించటంతో పాటు కొత్త నాయకత్వాన్ని ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు సికిందర్, బాపు, సావిత్రి, పోసుబాయి, పోశం, గోపాల్, రాణి, తార, నాగలక్ష్మి, భీమేశ్ పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలని రైతుల రాస్తారోకో

లక్సెట్టిపేట: కడెం చివరి ఆయకట్టు వరకు ఉన్న దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరి పొలాలకు యాసంగి పంటకు నీరందించాలని మండలాల్లోని రైతులు ఆదివారం సంక్రాంతి పండగ రోజున స్థానిక అంబేద్కర్ చౌరాస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మండలాలకు రెండు పంటలకు నీరందించేలా చూడాలని, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సుమారు రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు వచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. జలసాధనసమితి నాయకులు నైనాల గోవర్ధన్, రైతులు పాల్గొన్నారు.

కలప అక్రమంగా తరలిస్తే పీడీయాక్ట్



మాట్లాడుతున్న ఎఫ్‌డీవో బర్నోబా



స్వాధీనం చేసుకున్న కలప దుంగలు

- ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా

నేరడిగొండ: కలప అక్రమంగా తరలించే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామని ఇచ్చోడ ఎఫ్‌డీవో బర్నోబా అన్నారు. మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోరిగాం శివారు అటవీ ప్రాంతంలో టేకు చెట్లను నరికి రెండు వాహనాల్లో 19 కలప దుంగలను అక్రమంగా తరలిస్తుండగా ఎఫ్ఆర్వో గణేశ్ ఆ ధ్వర్యంలో పట్టుకున్నామన్నారు. నిందితులు నిజామాబాద్‌కు చెందిన వారిగా గుర్తించి, జావిద్ ఖాన్, మిర్జా మహెబూబ్, షేక్ అఫ్రోజ్, షేక్ షఫీ ఉద్దీన్, పఠాన్‌ఖాన్‌ను అరెస్టు చేశామన్నారు. సుల్తాన్ ప రారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. ముల్తానీల సహాయంతో కలప అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు తెలిపారు. రెండు వాహనాలను సీజ్ చేయగా, పట్టుకున్న కలప విలువ రూ.2లక్షల పైగా ఉంటుందని పేర్కొన్నారు. దాడి చేసి కలప పట్టుకున్న ఎఫ్ఆర్వోతో పాటు సిబ్బందిని అభినందించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో కౌఠ(బి) యువకుడు



కేంద్రమంత్రితో సోమేశ్వర్

బోథ్: బెంగుళూరులో జరుగుతున్న నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో బోథ్ మండలంలోని కౌఠ (బి) గ్రామానికి చెందిన వెండి సోమేశ్వర్ పాల్గొన్నారు. గత ఐదు రోజులుగా ఫెస్టివల్ కొనసాగుతోంది. కర్ణాటక సీఎం బసవరాజు బొమ్మైతోపాటు పార్లమెంట్ వ్యవహారాల, బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పాల్గొన్నారు. కాగా, తెలంగాణ నుంచి 10 మంది యువకులు పాల్గొనగా, అందులో సోమేశ్వర్ ఒకరు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దంపతులిద్దరు సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. భార్యభర్తలకు మధ్య గొడవ జరగగా, స్పిరిట్ తాగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ప్రస్తుతం వారు రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి కుదుటగానే ఉందని వైద్యులు తెలిపారు.

ప్రైవేట్ డెయిరీ నిర్వాహకులకు రిమాండ్

బెల్లంపల్లి: డెయిరీ నిర్వహణ పేరుతో బెల్లంపల్లి ప్రాంత రైతుల వద్ద రూ.లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు పంపారు. ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా సంతమగులురు మండలం చౌటుపాలెం గ్రామానికి చెందిన కందిమల్ల ఆదినారాయణ అలియాస్ హరిబాబు అలియాస్ హరికిషన్, అనంతపురం జిల్లా గంగవరం గ్రామానికి చెందిన బోయపాటి షేజల్ అలియాస్ నందినిని ఈ నెల 13వ తేదీన బెల్లంపల్లిలో అరెస్టు చేసినట్లు మంచిర్యాల ఇన్‌చార్జి డీసీపీ అఖిల్ మహాజన్ ప్రకటించారు. ఆ నిందితులను మరుసటి రోజు 14వ తేదీ శుక్రవారం చెన్నూర్ కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టారు. సదరు నిందితులను న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించడంతో ఆదిలాబాద్ జిల్లా జైలుకు పోలీసులు తరలించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు



గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఆదివాసీ గిరిజనుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలన్నారు. ఈనెల 21న ప్రారంభం కానున్న నాగోబా జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇక్కడకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. మంగళవారం మెస్రం వంశీయులు వడమరకు పవిత్ర గంగాజలాలతో చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ భీంరావ్, ఏపీవో పీటీజీ భాస్కర్, ఏవో రాంబాబు, హెచ్‌వో సుధీర్, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వద్దకు వెళ్లి..

తనకు మూడు చక్రాల స్కూటీ మంజూరుతోపాటు స్థానికంగా నివాసం ఉండేందుకు ఐటీడీఏ క్వార్టర్ ఇప్పించాలని దివ్యాంగురాలు గడ్డం భీంబాయి అర్జీ పెట్టుకునేందుకు ఐటీడీఏకు చేరుకుంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె వద్దకు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి నేరుగా వెళ్లి అర్జీ స్వీకరించారు. ఆమెకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



దివ్యాంగురాలి వద్దకు చేరుకుని అర్జీ స్వీకరిస్తున్న పీవో

కుక్కల దాడిలో 20 గొర్రెలు, మేక మృతి



మృతి చెందిన గొర్రెలు

లక్ష్మణచాంద(నిర్మల్): కుక్కల దాడిలో 20 గొర్రెలు, మేక మృతి చెందిన సంఘటన మండలంలోని చింతల్‌చాందలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నారికట్ల చిన్నయ్య ఇంటివద్ద కొట్టంలో గొర్రెలు, మేకలను ఉంచాడు. ఆదివారం రాత్రి కుక్కలు కొట్టంలోకి ప్రవేశించి వాటిపై దాడి చేశాయి. ఇందులో 20 గొర్రెలు, మేక మృతి చెందాయి. బతుకుదెరువుకోసం గతంలో గల్ఫ్ దేశానికి వెళ్లిన చిన్నయ్య అక్కడ కంపనీ సరిగా లేకపోవడంతో చేసిన అప్పులు తీరకుండానే ఇంటికి తిరిగి వచ్చాడు. గ్రామంలో ఇతరుల గొర్రెలు, మేకలు మేపుతున్నాడు. ఆదివారం నాటి ఘటనలో రూ.2లక్షల 30 వేల వరకు నష్టపోయానని బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ముగిసిన నానూమహరాజ్ జాతర



జాతరలో భక్తుల సందడి

సారంగపూర్(నిర్మల్): నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని బండరేవు తండాలో ఐదురోజులుగా కొనసాగుతున్న నానూ మహరాజ్ జాతర ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వివిధ గ్రామాలకు చెందిన వేలాదిమంది భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు నిర్వహించిన కుస్తీపోటీలు ఆహూతులను అలరించాయి. మహారాష్ట్ర, కుబీర్ తదితర ప్రాంతాలకు చెందిన వస్తాదులు కుస్తీపోటీల్లో పాల్గొన్నారు. జాతరకు ప్రధాన ఆకర్షణగా కుస్తీపోటీలు నిలిచాయి. ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఆర్టీఏ అజ్మీరా శ్యామ్‌నాయక్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విలాస్, రాంశంకర్‌రెడ్డి, తదితరులు సందర్శించారు. సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కుస్తీ పోటీలో తలపడుతున్న వస్తాదులు

అ'పూర్వ' సమ్మేళనం



2002-03 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం(ముథోల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల క్రితం తాము పాఠశాలలో కలిసి చదువుకున్న జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు మానిక్ కుమార్, ఉపాధ్యాయులు రవీందర్‌కుమార్, గంగన్న, అమృతం, రమణరావు, గంగాధర్, శ్రీధర్‌రెడ్డి, మల్లేశ్, సునీల్ కుమార్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సుధాకర్, రాజేశ్వర్, రమేశ్, అనిల్, భూమన్న, వియక్, నరేశ్, సుభాష్, లింగన్న, వినోద్, సుమలత, రజిత, పద్మ, మౌనిక, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండల కేంద్రంతో పాటు గొర్రెగుట్టలో కోడి పందేల స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ముందస్తు సమాచారంతో మండల కేంద్రంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి రెండు పందెం కోళ్లు, రూ.2,000 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మొర్లె తిరుపతి, బుర్రి రాములు, చింతపూడి పున్నం, పుల్లం స ంతోష్, గురిజాల వెంకన్న, వనపర్తి రాజు, జర్పుల కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. గొర్రెగుట్టలో రెండు పందెం కోళ్లు, రూ.2,150 నగదు స్వాధీనం చేసుకు ని ఆరుగురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. శ్రీరాముల ఎల్లయ్య, బకాం రాము, బొక్క వెంకటేశ్వర్ రావు, బొక్క కోటేశ్వర్‌రావు, దార లస్మయ్య, పస్తం బాలరాజుపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

సిర్పూర్(టి): భూపాలపట్నం శివారులో శనివారం కోడి పందేల స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని పట్టుకుని, రూ.8,100 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పారిగాం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్న పది మందిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల వద్ద రూ.13,030 నగదుతోపాటు నాలుగు పందెం కోళ్లు, మూడు కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.